అతిథులొస్తున్నాయి..!

మనుగడ కోసం పక్షులు వేల కిలో మీటర్లు ప్రయాణం చేస్తుంటాయి. ఇందులో భాగంగా ఏటా శీతాకాలంలో కవ్వాల్ టైగర్‌జోన్‌కు వలస వస్తుంటాయి.



- వివరాలు 8లో

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

కైలాస్‌నగర్: దీపావళిని జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పండుగ ఇంటింటా సిరుల పంట కురిపించాలని కోరుకుంటున్నట్లుగా తెలిపారు. అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నవంబర్ 3 వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

ఆదిలాబాద్‌టౌన్: దీపావళి పండుగ సందర్భంగా ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఈనెల 31 నుంచి నవంబర్ 3 వరకు నాలుగు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి మధుకర్ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి యార్డులో యథావిధిగా పత్తి కొనుగోళ్లు ఉంటాయని పేర్కొన్నారు. విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

‘రైతుల పక్షాన ఉండి పోరాడుతాం’



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే వ్యాపారుల పక్షాన ఉంటే.. తాము రైతుల పక్షాన ఉండి పోరాడుతామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతుల పక్షాన ఉండిపోరాడాల్సిన ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పత్తి కొనుగోళ్ల విషయంలో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఇందులో నర్సింగ్‌రావు, రమేశ్, మనోహర్, జగదీష్, తదితరులున్నారు.

ప్రొవిజినల్ జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్ లో భర్తీ చేయనున్న ల్యాబ్ టెక్నీషియన్ 3, పీఎండీ టీటీబీహెచ్‌వీ కోఆర్డినేటర్ ఒకటి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఒకటి, సీనియర్ డాట్‌ప్లస్ టీబీహెచ్ఐవీ ఒకటి, టీబీహెచ్‌వీ ఒక పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ జాబితాను బుధవారం విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో కృష్ణ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను కార్యాలయ నోటీసు బోర్డు తోపాటుhttp://adilabad. telangana. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

హ్యాపీ దీపావళి

ప్రమిదలు కొనుగోలు చేస్తున్న జనం



టపాసుల దుకాణం వద్ద సందడి



బంతిపూలు కొనుగోలు చేస్తూ..



దివ్వెల పండుగ వచ్చేసింది. వెలుగులు పంచే దీపావళిని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. పూజా సామగ్రి కొనుగోలు కోసం తరలివచ్చిన వారితో మార్కెట్ బుధవారం సందడిగా మారింది. రంగులు, పూలు, ప్రమిదలకు గిరాకీ పెరిగింది. టపాసుల దుకాణాల వద్ద జనం బారులు తీరారు. – ఆదిలాబాద్

సర్వేకు సన్నద్ధం



శిక్షణకు హాజరైన ఎన్యూమరేటర్లు



జైనథ్‌లో ఎన్యూమరేటర్ల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

- రెండు విడతలుగా నిర్వహణ
- నవంబర్ 6 నుంచి ప్రారంభం
- తొలి విడతలో గ్రామాలు, వార్డుల వారీగా ఇళ్ల గుర్తింపు
- ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ

జిల్లా సమాచారం
మండలాలు : 18
కుటుంబాలు : 162,046
జనాభా : 7,08, 972
ఎన్యూమరేషన్ బ్లాక్‌లు : 1816
కేటాయించిన ఎన్యూమరేటర్లు : 1901
సూపర్‌వైజర్లు : 192

కైలాస్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేదిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకోసం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది. రెండు విడతలుగా నిర్వహించనున్న సర్వేను విజయవంతం చేసేదిశగా యంత్రాంగం సమాయత్తమవుతుంది. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను ఎంపిక చేసిన అధికారులు సర్వే నిర్వహణ తీరుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎన్యూమరేట్లకు నిర్ణీత ప్రొఫార్మాతో పాటు సర్వేకు అవసరమైన సామగ్రిని అందజేశారు.

రెండు విడతలుగా..

సమగ్ర కుటుంబ సర్వేను రెండు విడతలుగా నిర్వహించనున్నారు. నవంబర్ 1నుంచి 3వరకు తొలి విడతలో భాగంగా ఇళ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) చేపట్టనున్నారు. ఎన్యూమరేటర్లు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణంలోని నిర్దేశిత వార్డుల్లో గల కుటుంబాల సమాచారం సేకరించనున్నారు. ఇంటి నంబర్, యజమాని పేరు, చిరునామా వంటి వివరాలను నమోదు చేస్తారు. ఆ ఇంటిని సందర్శించినట్లుగా రూపొందించిన ప్రత్యేక స్టిక్కర్‌ను అతికిస్తారు. ఈ సర్వేలో గుర్తించిన ఇళ్ల సంఖ్యకనుగుణంగా 4, 5వ తేదీల్లో సర్వేకు సంబంధించిన ప్రొఫార్మాలను ముద్రించనున్నారు.

6 నుంచి రెండో విడత

రెండో విడతలో భాగంగా నవంబర్ 6నుంచి 18 వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. గ్రామ పంచాయతీ, వార్డుల డిమాండ్ రిజిస్టర్ ఆధారంగా కుటుంబాలను నిర్ధారించనున్నారు. వివరాల నమోదు సమయంలో కుటుంబాల సంఖ్య పెరిగినట్లైతే బై నంబర్‌తో వారి వివరాలను నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించారు. వీరు ఆయా తేదీల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన 56 ప్రశ్నలతో 75 అంశాలతో కూడిన సమస్త సమాచారాన్ని సేకరించనున్నారు. ఎలాంటి వివరాలు సేకరించాలి, వాటిని ప్రొఫార్మాలో ఏ విధంగా నమోదు చేయాలనే దానిపై జిల్లాలోని ఎన్యూమరేటర్లందరికీ మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పది మంది ఎన్యూమరేటర్లకు సంబంధించిన కుటుంబాలను ఒక బ్లాక్‌గా గుర్తిస్తూ సూపర్‌వైజర్లను నియమించారు. పట్టణాల్లో మున్సిపల్, రెవెన్యూ అధికారులు సూపర్‌వైజర్లుగా పర్యవేక్షించనుండగా మండలాల్లో ఎంపీడీఓలు, ఎంపీవోలు, తహసీల్దార్లు పర్యవేక్షిస్తారు.

నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్

కలెక్టర్ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించనున్న సమగ్ర కుటుంబ సర్వే జిల్లా నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా వ్యవహరించనున్నారు. మండల నోడల్ అధికారులుగా వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు వ్యవహరించనున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే తీరును వీరు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కలెక్టర్‌కు వివరాలు నివేదించనున్నారు.

పారదర్శకంగా నిర్వహించాలి

కైలాస్‌నగర్: నవంబర్ 6నుంచి ప్రారంభమయ్యే సమగ్ర ఇంటింటి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో సర్వేకోసం ఎంపికైన 370 మంది ఎన్యూమరేటర్లు, 37 మంది సూపర్‌వైజర్లకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం శిక్షణఇచ్చారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా అందించిన శిక్షణను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారమివ్వకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రోజుకు పది కుటుంబాల సమాచారం సేకరించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం సర్వేకు అవసరమైన సామగ్రిని అందజేశారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, అర్బన్ స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డీఈ తిరుపతి, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్యూమరేటర్లకు ఏర్పాటు చేసిన శిక్షణను అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో లింగయ్య తదితరులున్నారు.

వచ్చేనెల 6 నుంచి ..

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): నవంబర్ 6 నుంచి 18 వరకు ఇంటింటి సమగ్ర సర్వే చేపట్టనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జైనథ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఏ ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా సర్వే చేయాలని ఆదేశించారు. ప్రజలకు ముందుగానే టాంటాం ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. నవంబర్ 1 నుంచి 3 వరకు తొలి విడతలో భాగంగా ఇళ్ల జాబితా సిద్ధం చేయాలని, 6 నుంచి 18 వరకు ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్యామ్ సుందర్, ఎంపీడీవో వెంకటరాజు, సూపర్‌వైజర్లు, ట్రైనర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో సమావేశ మందిరంలో ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఇందులో మండల ప్రత్యేకాధికారి పద్మభూషణ్‌రాజు, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ గోవింద్, ఎంపీవో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలి

- కలెక్టర్ రాజర్షిషా
- తుమ్మగూడలో దండారీ ఉత్సవాలకు హాజరు



గుస్సాడీ నృత్యం చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా, డీఎఫ్‌వో,చిత్రంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి: ఆదివాసీ, గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని తుమ్మగూడ గ్రామంలో బుధవారం రాత్రి దండారీ ఉత్సవాలు నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అతిథులుగా హాజరయ్యారు. అలాగే కుమురంభీం అసిస్టెంట్ కలెక్టర్ దీపక్‌తివారి, నిజామాబాద్ ట్రెయినీ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ముందుగా గ్రామస్తులు అతిథులను సంప్రదాయ వాయిద్యాలు, గుస్సాడీ నృత్యాల నడుమ స్వాగతం పలికారు. అనంతరం ఏత్మసూర్ దేవతలకు పూజలు నిర్వహించారు. అనంతరం దండారీ ఉత్సవాల నిర్వహణకు ఐటీడీఏ ద్వారా మంజూరు చేసిన రూ.15 వేల చెక్కులను నిర్వాహకులకు అందించారు. ఇందులో రాయిసెంటర్ జిల్లా సార్‌మేడీ మెస్రం దుర్గు, ఉట్నూర్ బీఈడ్ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, గ్రామ పెద్దలు మాన్కు, తదితరులున్నారు.

బాలికలకు భరోసా

- ధైర్యం నింపేలా.. ఆత్మస్థైర్యం పెంపొందించేలా
- సర్కారు బడుల్లో బాలికా సాధికారత క్లబ్‌లు
- జిల్లాలో 143 పాఠశాలల్లో జీసీఈసీల ఏర్పాటు
- కౌమార దశలో సమస్యలు అధిగమించేందుకు చర్యలు



కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థినులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినిల్లో ధైర్యం నింపేలా ఆత్మస్థైర్యం పెంపొందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కౌమార దశలో వచ్చే సమస్యలను ఎదుర్కొనేందుకు, వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను అధిగమించే దిశగా ముందుకు సాగుతుంది. ఇటీవల పలు పాఠశాలల్లో కొంతమంది ఉపాధ్యాయులు విద్యార్థినులపై వెకిలి చేష్టలకు పాల్పడిన విషయం తెలిసిందే. అలాగే పాఠశాలకు వచ్చి వెళ్లే సమయంలో పోకిరీలు, బడుల్లో కొంత మంది విద్యార్థులు వారిపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి వాటిని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గురువులకు చెప్పుకోలేక బాలికలు మానసికంగా సతమతం అవుతున్నారు. కొంతమంది తమలో తామే మనోవేదనకు గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఇంకొంత మంది ఎవరికి చెప్పుకోలేక దుఃఖాన్ని దిగమింగుతున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం గర్ల్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్ (జీసీఈసీ)లను ఏర్పాటు చేస్తుంది. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల తదితర ఉన్నత పాఠశాలల్లో వీటి ఏర్పాటుకు చర్యలు చేపడుతుంది.

కౌమార సమస్యలు ఎదుర్కొనేందుకు..

ఉన్నత పాఠశాలల్లో చదివే బాలికలు కౌమార దశలో మానసిక, శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయి. వారి నడవడిక, ప్రవర్తనలో మార్పులు కలుగుతాయి. విద్యార్థినులు చెడు అలవాట్లకు గురికాకుండా, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు బాలికా సాధికారత క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పాలి.. ఎలా అధిగమించాలి.. ఏయే ఇబ్బందులకు గురవుతున్నారు.. వాటికి పరిష్కారం కోసం ఈ క్లబ్‌లు దోహద పడతాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. విద్యార్థి దశలో కౌమార దశ అనేది ఎంతో కీలకం. అయితే విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు పోలీసు, వైద్యారోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలికల చట్టాలను తెలియజేసేందుకు న్యాయసేవాధికార సంస్థ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

కమిటీల ఏర్పాటు..

బాలిక సాధికారత కమిటీలను ఏర్పాటు చేసేందుకు విద్యా శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు. నవంబర్ 1న విద్యార్థినిలకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించనున్నారు. 4న జీసీఈసీ క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చైర్మన్‌గా, ఫ్రెండ్లీ టీచర్, ప్రతీ తరగతికి ఒక బాలిక సభ్యులుగా ఉంటారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను తెలియజేసేందుకు ఫిర్యాదుల పెట్టెను బడిలో ఏర్పాటు చేయనున్నారు. అలాగే రిజిస్టర్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను అందులో నమోదు చేయనున్నారు. అలాగే నోటీసు బోర్డుపై టోల్‌ఫ్రీ నం.1098 ను ఏర్పాటు చేయనున్నారు. డిసెంబర్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన, జనవరిలో న్యాయ సదస్సులు, ఫిబ్రవరిలో నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్షించనున్నారు. విద్యార్థులకు సదస్సులు ఏర్పాటు చేసి బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌ను తెలియజేస్తారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వారిపై చర్యలు తీసుకునేలా కమిటీలు కృషి చేస్తాయి.

ఆత్మవిశ్వాసం పెంపొందించేలా కరాటే శిక్షణ..

బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ పరియోజన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రతీ ఉన్నత పాఠశాలలో కరాటే శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో 163 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇటీవల శిక్షకులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 54 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమం మూడు నెలల పాటు కొనసాగనుంది. శిక్షకుడికి నెలకు రూ.5వేల చొప్పున వేతనం ఇవ్వనున్నారు. ప్రతీ పాఠశాలలో 6 నుంచి 8 తరగతులు చదివే విద్యార్థినిలకు శిక్షణ కల్పిస్తారు. ఈ కార్యక్రమాలు పీఈటీ, పీడీ, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహిస్తారు.

సాధికారత క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు



జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బాలికా సాధికారత క్లబ్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. నవంబర్ 4న అన్ని పాఠశాలల్లో వీటిని ఏర్పా టు చేసి ఫిర్యాదుల పెట్టె, రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచుతాం. 143 పాఠశాలల్లో జీసీఈసీ క్లబ్‌లను, అలాగే 163 పాఠశాలల్లో కరాటే శిక్షణ నేర్పించేలా చర్యలు చేపడుతున్నాం.

– ఉదయ్‌శ్రీ, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి



విద్యార్థులతో పఠనం చేయిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జైనథ్ మండలంలోని దీపాయిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూమ్‌టు రీడ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రెరీని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా జిల్లాలోని ప్రతీ మండలానికి ఒక మోడల్ లైబ్రరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్, సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్, ఎంఈవో శ్రీనివాస్, విజయసారధి, మహేందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా పత్తికి ఒకే మద్దతు ధర

- అధిక ధర ఉన్నట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..
- జోగు రామన్నపై ఎమ్మెల్యే శంకర్ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: సీసీఐ దేశమంతా ఒకే మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి జోగు రామన్న తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల పత్తి కొనుగోళ్ల విషయంలో ఇబ్బందులు తలెత్తినప్పుడు తాను హైదరాబాద్ నుంచి వచ్చి అధికారులు, వ్యాపారులు, రైతులతో కలిసి చర్చించి కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా చొరవ చూపానన్నారు. అయినప్పటికీ తనపై విమర్శలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో సీసీఐ తక్కువ మద్దతు ధరకు పత్తిని కొంటుందని, అదే గుజరాత్‌లో ఎక్కువ ధరతో కొనుగోలు చేస్తుందని ఆయన విమర్శించడం సరికాదన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ కనీస అవగాహన లేకుండా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. గుజరాత్ రాష్ట్రంలోనూ సీసీఐ ఒకే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, ఈ విషయమై స్వయంగా మాజీ మంత్రిని తీసుకువెళ్లి చూయిస్తానని పేర్కొన్నారు. అక్కడ అధిక మద్దతు ధర ఉంటే వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తూ లేఖను అక్కడి నుంచే అసెంబ్లీకి పంపిస్తానన్నారు. ఇందులో నాయకులు అయ్యన్న గారి భూమన్న, బ్రహ్మనంద్, ఆదినాథ్, లాలా మున్నా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు



నిందితులతో ఎస్సై సుగుణాకర్‌

నస్పూర్‌: సీసీసీ నస్పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీసీసీ నస్పూర్‌ ఎస్సై సుగుణాకర్‌ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నాగార్జున కాలనీలోని ఓ ఇంటిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. పూదరి సతీశ్‌, మూసక ప్రభాకర్‌, దాసరి చంద్రమౌళి, ఎడ్ల రామారావులను అరెస్ట్‌ చేసి వారి వద్ద నుంచి రూ.30,140 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నజ్రూల్‌నగర్‌ ఘటనలో నిందితుల అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని నజ్రూల్‌నగర్‌ విలేజ్‌ నం.5లో ఈనెల 26న జరిగిన ఘటనలో బుధవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రామానుజం, కాగజ్‌నగర్‌ రూరల్‌ సీఐ శ్రీనివాస్‌ తెలిపారు. పోలీసు విధులను ఆటంకపర్చినందుకు మనీష్‌ మానిక్‌దాస్‌, డెబాశిష్‌ మండల్‌, బుద్ధేశ్వర్‌రాయ్‌లను అరెస్టు చేశామన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దని పేర్కొన్నారు. సోషల్‌ మీడియాలో వదంతులు వ్యాప్తి చేసేవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల అస్వస్థత



చికిత్స పొందుతున్న విద్యార్థినులు

వాంకిడి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులు బుధవారం అస్వస్థతకు గురయ్యారు. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 30 మంది విద్యార్థునులకు ఒక్కసారిగా కడుపునొప్పితో కూడిన విరేచనాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స అనంతరం విద్యార్థినులు పూర్తిగా కోలుకున్నట్లు వైద్యుడు వినయ్‌ తెలిపారు. విద్యార్థినులు అస్వస్థతకు గల కారణాలు తెలియరాలేదు.

వృద్ధుడి ఆత్మహత్య

కౌటాల: మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన సర్వర్‌ లాలూ(59) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మధుకర్‌ బుధవారం తెలిపారు. గత కొద్ది రోజులుగా లాలూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిర్పూర్‌(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు నితిన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామానికి చేరిన గణేశ్‌ మృతదేహం



గణేశ్‌ మృతదేహం

లక్ష్మణచాంద: గత వారం రోజుల క్రితం దుబాయ్‌లో మృతి చెందిన ఆ కుల గణేశ్‌ (25) మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. మండలంలోని మల్లాపూర్‌ గ్రా మానికి చెందిన ఆకుల పుష్పలత –పెంటయ్య దంపతుల ఏకైక కుమారుడు గణేశ్‌ రెండేళ్ల కిందట బతుకుదెరువు కోసం దుబాయ్‌ వెళ్లాడు. ఈ నెల 22న కంపెనీలో పని చేసే సమయంలో గుండెపోటుతో మృతిచెందాడు. గల్ఫ్‌ కార్మికుల రక్షణ సమితి చొరవతో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. భార్య జయశ్రీ, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య గణేశ్‌ అంత్యక్రియలు నిర్వహించారు.

అతిథులొస్తున్నాయి..!



ఈ పక్షిపేరు ఎరుపు అవదావత్‌ లేదా రెడ్‌ మునియా పక్షి. ఈ పక్షి ఎస్ట్రీల్డిడే సంతతికి చెందిన పిచ్చుక. ఇది ఉష్ణమండలంలోని ఆసియా ప్రాంతంలో గడ్డి ఎక్కువగా ఉన్న చోట ఉంటుంది. శీతాకాలంలో తమ సంతతిని పెంచుకోవడానికి ఇటీవల కవ్వాల్‌ టైగర్‌జోన్‌లోని జన్నారం అడవుల్లో గల నీటి కుంటలో కనిపించింది.



ఇది ఇండియన్‌ ప్యారడైజ్‌ ఫ్లైక్యాచర్‌. ఆసియాకు చెందిన మధ్యస్థపరిమాణ ప్యాసెరస్‌ పక్షి. భారత ఉపఖండం, ఆసియా దేశాలలో, మయన్మార్‌ ప్రాంతాలలో ఎక్కువగా కనిపిస్తుంది. దీని తలపై నల్లని కిరీటం ఆకారంలో జుట్టు ఉంటుంది. ఇది 19 –22 సెం.మీ పొడవు ఉంటుంది. శీతాకాలం ప్రారంభమవుతున్నందున జన్నారం అటవీ డివిజన్‌లోకి వలస వచ్చింది.

భూమిమీద కొన్ని వేల రకాల పక్షి జాతులు ఉన్నాయి. మనుగడ సాగించేందుకు పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తుంటాయి. కవ్వాల్‌ టైగర్‌జోన్‌కు సైతం ఏటా శీతాకాలంలో ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల పక్షులు వలస వస్తుంటాయి. ప్రస్తుతం శీతాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఆసియాలోని ఇతర దేశాల నుంచి పక్షులు అతిథులుగా వస్తున్నాయి. ఈ పక్షులు శీతాకాలంలో ఇక్కడే ఉండి తమ సంతతిని పెంచుకుని తిరిగి వాటి ప్రాంతాలకు వెళ్తాయని అధికారులు చెబుతున్నారు. – జన్నారం

- కవ్వాల్‌ టైగర్‌జోన్‌లో పక్షుల కిలకిలలు
- ఏటా శీతాకాలంలో ఇతర ప్రాంతాల నుంచి వలస
- అటవీ ప్రాంతంలో 300 రకాల పక్షులు



బ్లాక్‌ వింగ్‌డ్‌ కైట్‌



క్రస్టెడ్‌ సర్పెంట్‌ ఈగల్‌



ఇండియన్‌ కోర్మోరెంట్‌

300 రకాలకు పైగా పక్షులు

వన్యప్రాణులకు నిలయంగా మారిన కవ్వాల్‌ పులుల రక్షిత ప్రదేశం ఇప్పుడు పక్షులకు ఆవాసంగా మారుతోంది. వన్యప్రాణుల సంరక్షణతో పాటు పక్షి జాతుల సంరక్షణపై అటవీ అధికారులు దృష్టి సారించారు. బర్డ్స్‌ ఫెస్టివల్‌లో భాగంగా జన్నారం అడవులకు వచ్చిన పక్షి ప్రేమికులు పలు రకాల కొత్త పక్షులను గుర్తించారు. ఈ పక్షుల విశేషాలను అధికారులకు తెలియజేశారు. ఈ క్రమంలో కవ్వాల్‌ పులుల రక్షిత ప్రదేశంలో 300లకు పైగా పక్షి జాతులున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు 200 రకాల పక్షుల వివరాలను సేకరించారు.

కళ్లముందే అనేక పక్షి జాతులు..

జన్నారం అటవీ డివిజన్‌లో కొంగలు, ఉలీ నెక్‌డ్‌ స్పార్క్‌, పిచ్చుకలు, చిలుకలు, వడ్రంగి పిట్ట, చికుముకి పిట్ట, పాలపిట్ట, వల్చర్‌, అడవి పావురాలు, పిచ్చుకలు, గద్దలు, కింగ్‌ఫిషర్‌, కోకిల, గోరింకలు, గువ్వలు, బ్లాక్‌ నెక్‌డ్‌ పక్షులు ఇలా అనేక రకాల పక్షులు ఉన్నాయి. వీటితో పాటు వివిధ దేశాల నుంచి వచ్చిన 50 రకాల పక్షుల జాతులను కవ్వాల్‌ టైగర్‌జోన్‌లో గుర్తించినట్లు అధికారులు తెలిపారు.



ట్రికోలర్డ్‌ మోనియా



వైట్‌ ఐ బుజర్డ్‌ పక్షి

మొదలైన వలసలు..

ప్రతీ సంవత్సరం మాదిరి ఈ ఏడాది కూడా పక్షుల వలసలు ప్రారంభమయ్యాయి. ఏటా అక్టోబర్‌ చివరి వారం నుంచి జనవరి వరకు వివిధ దేశాల నుంచి పక్షులు వచ్చి సంతతిని పెంచుకుంటాయి. అడవిలో నీటి ఆవాసాలు, గడ్డి క్షేత్రాలు ఉండటం వల్ల పక్షులు పెద్ద సంఖ్యలో వలస వస్తున్నాయి. జన్నారం డివిజన్‌లో బైసన్‌కుంట, మైసమ్మ కుంట, ఘనిషెట్టి కుంట, కల్పకుంట, ఉట్నూర్‌ డివిజన్‌ ఉడుంపూర్‌ గాదం చెరువు, కడెం ప్రాజెక్టు, కాగజ్‌నగర్‌ ప్రాంతాలలో ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు.



ఆసియన్‌ పీడ్‌ స్టార్లింగ్‌



స్మాల్‌ మిన్వెట్‌



చేంజేబుల్‌ హాక్‌ ఈగల్‌

పక్షులను గుర్తిస్తున్నాం



ప్రతీ సంవత్సరం వలస పక్షులు వస్తుంటాయి. తిరిగి వెళ్తుంటాయి.ఏటా పక్షులను గుర్తిస్తాం. ఈ సంవత్సరం పక్షుల వలసలు ప్రారంభమయ్యాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పక్షులు తిరిగి ఫిబ్రవరిలో వెళ్తాయి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం టైగర్‌జోన్‌ వ్యాప్తంగా వివిధ రకాల పక్షులను గుర్తిస్తున్నాం.

– జోగు ఎల్లం, ఎన్‌టీసీఎస్‌ సభ్యుడు

వలసలు ప్రారంభమయ్యాయి



కవ్వాల్‌ టైగర్‌జోన్‌లోని ప్రాంతాలకు వివిధ దేశాల నుంచి పక్షులు వలసలు వస్తుంటాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో సంతతి పెంచుకుని తిరిగి వెళ్తాయి. ఈ సంవత్సరం చలి తక్కువగా ఉన్నందున ఇప్పుడే వలసలు ప్రారంభమయ్యాయి. నవంబర్‌ మొదటి వారం వరకు అన్ని రకాల పక్షులు ఇక్కడికి చేరుకుంటాయి. పక్షుల రక్షణ కోసం అటవీశాఖ కృషి చేస్తుంది.

– శివ్‌ ఆశిష్‌ సింగ్‌, జిల్లా అటవీశాఖ అధికారి, మంచిర్యాల

తండ్రి మృతి.. కుమారుడి నిరసన



మున్సిపల్‌ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కల్యాణ్‌పాండే

బెల్లంపల్లి: డ్రెయినేజీని మూసివేయడంతో వచ్చిన దుర్వాసన వల్లే తన తండ్రి, సింగరేణి రిటైర్డు కార్మికుడు దయానంద్‌ ప్రసాద్‌ పాండే (82) మృతి చెందాడని కల్యాణ్‌పాండే బుధవారం బెల్లంపల్లి మున్సిపల్‌ కార్యాలయం ఎదుట నిరసన తెలిపాడు. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపాలిటీలోని 29వ వార్డు బజారు ఏరియా డబ్బుసేట్‌లైన్‌లో దయానంద్‌ప్రసాద్‌ పాండే నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో వీధి లోని డ్రెయినేజీని తాత్కాలికంగా మున్సిపల్‌ సిబ్బంది మూసివేశారు. దీంతో మురికి కాలువలో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుండగా, దుర్వాసనతోనే తన తండ్రి దయానంద్‌ప్రసాద్‌ పాండే మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడని, డ్రెయినేజీని మూసి ఉంచిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్యాణ్‌పాండ్‌ ప్లకార్డు పట్టుకుని ఆందోళన చేశాడు. ఈ ఘటన సోషల్‌ మీడియాలో వైరల్‌ కాగా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో కల్యాణ్‌పాండే ఫిర్యాదు చేశాడు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

నార్నూర్‌: మండలంలోని రాజులగూడ గ్రామానికి చెందిన కుమ్ర రేణుకబాయి(30) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్సై గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జైనూర్‌ మండలంలోని ఉషెగాం గ్రామానికి చెందిన తొడసం పార్వతిబాయి –రాంజీ దంపతుల పెద్ద కుతూరు తొడసం రేణుకబాయిని నార్నూర్‌ మండలం రాజుగూడ గ్రామానికి చెందిన కుమ్ర అంకోష్‌కు ఇచ్చి 15 ఏళ్ల క్రితం వివాహం చేశారు. ఆమెకు గత కొన్నేళ్ల నుంచి మతి స్థిమితం లేదు. మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన రేణుకబాయి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం రాజులగూడ గ్రామ శివారులో ఉన్న బావిలో రేణుకబాయి మృతదేహం లభ్యమైంది. పార్వతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

దండారీ వేళ కుటుంబంలో విషాదం

- పురుగుల మందు తాగిన అన్నదమ్ములు
- అన్న మృతి, చికిత్స పొందుతున్న తమ్ముడు



మర్సుకోల న్యానేశ్వర్‌ (ఫైల్‌)

జైనూర్‌: ఏజెన్సీ ప్రాంతాల్లో దండారీ ఉత్సవాలు ఘనంగా జరుగుతుండగా మండలంలోని గూడమామడ గ్రామానికి చెందిన ఒక కుటుంబంలో మాత్రం విషాదచాయలు అలుముకున్నాయి. దండారీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు సిద్ధమైన ఇద్దరు అన్నదమ్ములు చిన్న గొడవతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గూడమామడ గ్రామానికి చెందిన మర్సుకోల గంగారాంకు ఇద్దరు కుమారులు న్యానేశ్వర్‌, శంకర్‌ ఉన్నారు. గూడమామడ గ్రామానికి చెందిన దండారీ సోనాపూర్‌కు వెళ్తుండగా వీరిద్దరు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈక్రమంలో ఇంట్లో ఉన్న పశువులను మేతకు తీసుకెళ్లేందుకు ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా మనస్తాపానికి గురైన వీరు మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఇంటి ఆవరణలో వాంతులు చేసుకోవడంతో గమనించిన తండ్రి ఉట్నూర్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించాడు. అయితే అప్పటికే మర్సుకోల న్యానేశ్వర్‌(24) మృతి చెందగా, మెరుగైన వైద్యం కోసం మర్సుకోల శంకర్‌ను ఆదిలాబాద్‌ రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్‌ బుధవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

ఇచ్చోడ: మండలంలోని సాథ్‌నంబర్‌ వద్ద 44వ జాతీయ రహదారిపై కారు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మహారాష్ట్ర నుంచి నిర్మల్‌ వైపు వెళ్తున్న కారు ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న సునీల్‌తో పాటు ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.

విద్యార్థినికి సీఎం ఆర్థికసాయం



సాయిశ్రద్ధకు ఆర్థికసాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి

జైనూర్‌: నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పేదింటి విద్యా కుసుమం సాయిశ్రద్ధకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని జెండాగూడ గ్రామానికి చెందిన మెస్రం న్యానేశ్వర్‌ –లక్ష్మి దంపతుల కుమార్తె సాయిశ్రద్ధ నీట్‌లో ఎస్టీ కోటాలో 103వ ర్యాంకుతో మంచిర్యాల ప్రభుత్వ మెడికల్‌ కాలేజీలో సీటు సాధించింది. పేద కుటుంబం కావడంతో కాలేజీలో చేరేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ సాయిశ్రద్ధ పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం సాయిశ్రద్ధ ఎంబీబీఎస్‌ పూర్తి అయ్యే వరకు సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా వైద్యవిద్యకు అవసరమైన పూర్తి మొత్తం ఆర్థికసాయం చేసినట్లు సాయిశ్రద్ధ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

మందమర్రిరూరల్‌(రామకృష్ణాపూర్‌): మందమర్రి మండలంలోని కోటేశ్వరరావు పల్లెకు చెందిన సైదం రాజమ్మ(62) అనే వృద్ధురాలు బుధవారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు రామకృష్ణాపూర్‌ ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు. సాయంత్రం కాలకృత్యాల కోసం ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూంకు వెళ్లగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బావిలో పడి మృతిచెందినట్లు పేర్కొన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.

23,10,190

ఇదీ ఉమ్మడి జిల్లా ఓటర్ల సంఖ్య

- పెరిగిన ఓటర్ల సంఖ్య 91,027
- అప్పుడు.. ఇప్పుడు మహిళా ఓటర్లే అధికం
- ముసాయిదా ఓటరు జాబితా విడుదల

మంచిర్యాలడెస్క్‌: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఓటు నమోదుపై అవగాహన, ఎన్నికల సంఘం, అధికారులు చేపట్టిన కార్యక్రమాలతో ఓటర్ల సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం మంగళవారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటరు ముసాయిదా జాబితా–2024ను విడుదల చేసింది. పది నియోజకవర్గాల్లో మొత్తం 23,10,190మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 11,31,150 మంది పురుష ఓటర్లు, 11,78,906 మంది మహిళా ఓటర్లు, 134 మంది ఇతరులు ఉన్నారు. 2023 ఎన్నికల సమయంలో ఓటరు జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లా ఓటర్ల సంఖ్య 22,19,163 ఉంది. వీరిలో పురుష ఓటర్లు 10,93,381 మంది, మహిళలు 11,25,65మంది, ఇతరులు 126మంది ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటి ఓటరు జాబితా.. ప్రస్తుత ఓటరు జాబితాను పోల్చి చూస్తే 91,027 మంది ఓటర్ల సంఖ్య పెరిగింది. అప్పుడు.. ఇప్పుడు మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉంది. ఇతర ఓటర్లలోనూ స్వల్పంగా పెరుగుదల కనిపిస్తోంది.

మహిళలే అధికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉంది. ప్రతీ ని యోజకవర్గంలోనూ మహిళలే ఎక్కువగా ఉన్నారు. 2023నాటి జాబితా ప్రకారం మహిళా ఓటర్ల సంఖ్య 11,25,656 ఉండగా.. ముసాయిదా జాబితా ప్రకారం 11,78,906కు పెరిగింది. ఈ లెక్కన 53,250 మంది మహిళా ఓటర్ల సంఖ్య పెరిగింది.

జిల్లాల వారీగా..

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కుమురంభీం ఆసిఫాబాద్‌	2,27,666	2,29,588	31	4,57,285
మంచిర్యాల	3,23,278	3,29,924	45	6,53,247
ఆదిలాబాద్‌	2,23,176	2,35,154	8	4,58,338
నిర్మల్‌	3,57,030	3,84,240	50	7,41,320

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్‌	1,14,708	1,14,896	8	2,29,619
ఆసిఫాబాద్‌(ఎస్టీ)	1,12,958	1,14,692	16	2,27,666
చెన్నూర్‌(ఎస్సీ)	96,549	98,383	7	1,94,939
బెల్లంపల్లి(ఎస్సీ)	87,800	89,819	12	1,77,631
మంచిర్యాల	1,38,929	1,41,722	26	2,80,677
ఆదిలాబాద్‌	1,20,382	1,25,855	6	2,46,243
బోథ్‌(ఎస్టీ)	1,02,794	1,09,299	2	2,12,095
ఖానాపూర్‌(ఎస్టీ)	1,10,314	1,15,526	13	2,25,853
నిర్మల్‌	1,22,553	1,37,040	20	2,59,613
ముథోల్‌	1,24,163	1,31,674	17	2,55,854

బాస్కెట్‌బాల్‌ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో వీసీ గోవర్ధన్‌

భైంసా: సౌత్‌జోన్‌ ఇంటర్‌ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్‌ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్‌ అభినందించారు. బుధవారం ఎంపికైన విద్యార్థులతో కలిసి మాట్లాడారు. బాసర క్యాంపస్‌లో క్రీడారంగాని కి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. క్యాంపస్‌స్థాయిలో ఎంపికైన విద్యార్థులు బెంగుళూర్‌లో జరిగే సౌత్‌జోన్‌ పోటీల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్‌ స్పెషల్‌ ఆఫీసర్‌ ప్రభాకర్‌రావు, శ్యాంబాబు, వసంత, విజయ, రవి, కిరణ్‌, రఘువీర్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైల్వే జేఈ మృతి



సాయి హిమాన్ష్‌ మృతదేహం

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌ ఏరియా పరిధిలోని రైల్వే కాలనీలో విద్యుదాఘాతానికి గురై రైల్వే జూనియర్‌ ఇంజినీర్‌ మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్‌ ఎస్సై మహేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం దీపావళి పండుగ నేపథ్యంలో సాయి హిమాన్ష్‌ (29) తాను నివాసం ఉంటున్న క్వార్టర్‌లో విద్యుత్‌ దీపాలు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో ఆకస్మికంగా విద్యుత్‌ సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త సాయి హిమాన్ష్‌ కళ్లముందే కానరాని లోకాలకు వెళ్లడంతో భార్య అనూష కన్నీరుమున్నీరైంది. వారి స్వస్థలం వరంగల్‌ జిల్లాలోని రాంపేట గ్రామం. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. మృతుడికి మూడేళ్ల కుమారుడు సాయిరాం ఉన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరస్పరదాడిలో పలువురిపై కేసు నమోదు

బెల్లంపల్లిరూరల్‌: కుటుంబ కలహాలతో పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో పలువురిపై కేసు నమోదైంది. తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి గ్రామానికి చెందిన కచ్చు మనీషా అదే గ్రామానికి చెందిన కచ్చు రాజ్‌కుమార్‌ను నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరి ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో మనీషా తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి పక్కనే ఆడుకుంటున్న కూతురు సహన్షితో రాజ్‌కుమార్‌ మాట్లాడుతుండగా భార్య మనీషా, అత్త రాజేశ్వరి దుర్భాషలాడడంతో పాటు రాజ్‌కుమార్‌, అతని తల్లి వజ్రమ్మలపై దాడికి పాల్పడ్డారు. రాజ్‌కుమార్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మనీషా, రాజేశ్వరిలపై కేసు నమోదైంది. కాగా మనీషా భర్త రాజ్‌కుమార్‌, మామ భూమయ్య, అత్త వజ్రమ్మ, మరుదులు మహేశ్‌, రాజశేఖర్‌లు అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు తనపై, తన తల్లి రాజేశ్వరిలపై దాడి చేసి గాయపర్చారని ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.